


"మా శాంతి పెళ్ళికూతురవబోతూం దండి పిన్నిగారూ!"

మంచంమీద బోర్లగిల పడుకొని వీక్లీ తిరగేస్తున్న శాంతికి అమ్మమాటలు వినిపించాయి వరండానుండి. పక్కింటి బామ్మగారూ, ఆవిడ కోడలు వచ్చినట్లున్నారు అమ్మ చెపుతోంది. తన పెళ్ళి ప్రస్తావన వినగానే శాంతికి తలనొప్పి వచ్చినట్లయింది.

"హల్లాగుచే అమ్మాయీ! అదృష్టవంతురాలు. మరి ఈ కాలంలో ఆడపిల్ల పెళ్ళంచే మాటలా!" బామ్మగారుముసుగు సవరించుకొంటూ అన్నారు.

"అయితే మాకు త్వరలోనే పప్పు

న్నము వుందన్నమాట!" బామ్మగారి కోడలి ఛలోక్తి.

"అవును వదినగారూ."

శాంతి తలమీద సుత్తిపెట్టి కొడుతు న్నంత బాధ; అదేమిటో అర్థం అయీ కాని బాధ. చేతిలోని పుస్తకం ఎప్పుడు క్రిందికి జారిందో తెలియదు. కేవలం బయటినుండి లీలగా మాటలన్నీ ఆమె చెవుల్లో పడుతున్నాయి.

"అయితే అబ్బాయికేం వుద్యోగం?"

"ఎమ్.ఏ. చదివి లెక్చరర్‌గా వుంటు న్నాడు వైజాగ్‌లో. కట్నం వాళ్ళుగా అడగలేదుగానీ మాకు తోచినంత మేము మా పిల్లకి పెట్టుకుంటాం!"

"బాగుందమ్మా చాలా బాగుంది. డాక్టరీ చదివిన పిల్లకి కూడా వేలకువేలు కట్నాలు కుమ్మరించాల్సిన ఈ కాలంలో శాంతి చాలా అదృష్టవంతురాలు. మా మనుమరాలికింకా ఆ శుభఘడియ ఎప్పుడో!"

తన నెత్తిపొడిచినట్లు బామ్మగారి కోడలు గింజుకుంటూ యిలా అంది "బాగుంది అ ఘడియవస్తే ఆగుతుందా? వూరికే పెళ్ళో పెళ్ళో అని జపంచేస్తే అయిపోతుందా!"

"అయినా మీ పిల్లకేమే బంగారుతీగ" బామ్మగారు కోడలి విసురు తగలనట్లు అంది అమ్మతో.

కోడలి కింకా మండినట్లుంది "మన అమ్మాయికి మాత్రం ఏం తక్కువని? మీ పనికిరాని చాదస్తాలతో దాని చదువు ఆశించారుగాని శాంతి యీడుది. శాంతి లాగే యీపాటికి బి.ఏ. ప్యాసయివుండేది కాదా?"

వాళ్ళ పోట్లాట మార్చటానికన్నట్లు మాట మార్చింది అమ్మ.

"పెళ్ళి రేపు వైశాఖలోనే పిన్ని గారూ! ఓ పదిరోజులు ముందరనుండీ మా యింట్లోనే!"

"అయ్యో! ఎంత మాట! వేరే చెప్పాలా?"

ఇక ఏం మాట్లాడుకొంటున్నారోగాని శాంతి తలనిండా ఆలోచనలు మూగి మరి విననీయకుండా చేశాయి. నీరసం వచ్చి నట్లయింది. యిన్నాళ్ళూ పుట్టిపెరిగిన ఈ గాలి ఈవూరు ఒక్కసారిగా దూరం అయిపోతాయి పెళ్ళి అవటంతోనే! యిన్నేళ్ళూ అమ్మానాన్నలతో, తోబుట్టువులతో అతి మధురంగా ఆనందంగా గడిపిన అమూల్య క్షణాలు మరి తిరిగిరావు. యిన్నేళ్ళూ కన్నతల్లితో పెంచుకున్న సాన్నిహిత్యం ఒక త్రుటిలో మాయమై పోతుంది. పెళ్ళయిన ఆడది పుట్టింటికి వచ్చినా ఆ సంబంధం వేరు. ఇదంతా వేరే జీవితమే!

యిన్నేళ్ళ యీ బ్రతుకూ మరొకరి పరం కాబోతూంది. ఎందుకు ఎందుకిదంతా? యిది త్యాగం కాదూ? ఎవరి తృప్తికోస మిదంతా? సమాజమా? సమాజంలో నిలబడటానికి తోడు వుండితీరాలా?

అమ్మానాన్నా యిందరినీ వదలి ముఖ మెరుగని వ్యక్తిని తోడుచేసుకోవాలా? ఏమిటీ సృష్టివైపరీత్యం! తనవారితో అల్లుకుపోయిన మమతాపాశం ఎందుకు త్రెంచుకోవటం? యీ యిల్లు, తనవాళ్ళు, అందరినీ వదలి ఎక్కడికో ఎందుకు వెళ్ళటం? నాకు పెళ్ళివద్దు: అమ్మను తమ్ముళ్ళను చెల్లెళ్ళను వదలివెళ్ళటం నా తరం కాదు. ఆ జీవితం తలచుకోవటానికే భయమేస్తూంది. రక్తబంధం తెంచుకొని అపరిచిత ప్రదేశంలో జీవితాంతం జీవించటం నాకు చేతకాదు. పరాయి మనుష్యుల మధ్యన మసలటం నాకు తెలియదు, తెలియదు"

శాంతి కళ్ళు జలజలా వర్షిస్తున్నాయి.

"శాంతీ అదేమిటే అలా పడుకొన్నావు?" బామ్మగారినీ ఆవిడ కోడల్నీ సాగనంపి జానకమ్మ శాంతి దగ్గర కొచ్చింది. దిండులో ముఖందాచుకొని ఏడుస్తున్న శాంతినిచూసి ఆవిడ ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుకుంది.

"అదేమిటే శుభమా అని పెళ్ళి దగ్గర పడుతుంటే ఆ ఏడుపు?"

"అమ్మా నాకు పెళ్ళివద్దు. మిమ్మల్నందరినీ వదలి నేనుండలేనమ్మా."

జానకమ్మ విస్తుపోయినా కూతురి బాధ కొంతవరకు అర్థంచేసుకుంది.

"పిచ్చిపిల్లా! పెళ్ళి వద్దకపోవటమేమిటే, పెళ్ళయితే మనయింటికిరావా."

"లేదమ్మా. ఆజీవితం నా కిష్టంలేదు. ముక్కు మొహ మెరుగని ఎవరికోసమో ఆప్యాయతానురాగాలు పంచి యిచ్చి మీ అందరిలో ఒకదానిగా నిలుపుకొన్న నన్ను వెళ్ళిపొమ్మనటం భావ్యమా? మీరులేని ఆ జీవితం తలచుకోటానికే భయం కల్గిస్తుందమ్మా:"

"ఏమిటా పిచ్చిమాటలు? భర్త నీకు మొగమెరుగనివాడా? మే మందరమూ నీలాగే అనుకొనివుంటే ఎలాగుండేది చెప్పు! పిచ్చివూహలు కట్టిపెట్టు. లక్షణమయిన కుర్రాడితో పెళ్ళవుతోందని సంతోషించు."

మందలించి జానకమ్మ వెళ్ళిపోయింది 'స్త్రీ ఎందుకిలా స్త్రీగా పుట్టింది భగవాన్' నిస్సహాయంగా అనుకొంది శాంతి.

## 2

పెద్దలందరి సమక్షంలో రవిశంకర్ అర్ధాంగయింది శాంతి. తప్పనిసరిగా పెళ్ళిపీటలమీద కూర్చుంది. రవిశంకర్ శాంతికి తగ్గ రూపసి. విద్యాధికుడు. మౌనంగావున్న శాంతికి అత్తా ఆడపడుచులను చూస్తేనే భయం కల్గింది. చాలా చోట్ల వాళ్ళుపెట్టే ఆరళ్ళు వినివుండటం వల్ల ఆమెకలా అనిపించింది. మనసులెటువంటివో తెలియని ఈ మనుష్యుల మధ్య ఇరవ్వయ్యేళ్ళు నిండని ఈ కన్నె జీవితం మొదలుపెట్టి ఎప్పటిదాకా సాగదీయాలి? కాపురానికి వస్తుంటే ఎంతగా ఏడ్చిందనీ! అప్పగింతలప్పుడు ఆ బాధ అనుభవించే వారికి తప్ప ఎవరికర్థమవు

తుంది. పుట్టినప్పటినుండీ తమ శక్తి లోపంలేకుండా పెంచి అటువంటి బిడ్డల్ని మరొకరింటికి పంపటం తల్లిదండ్రులకి ఆనందమా? ఏమో! పైగా కొన్ని వేలు కట్నరూపంలో ఆ పిల్లతో సహా ముట్ట చెప్పాలి. ఆ మగ పెళ్ళివారికి అప్పుకి వడ్డీ తీర్చినట్లు!

అత్తవారింట అడుగుపెట్టిన శాంతికి బెదురు భయం కలిపి నోటమాటరాకుండా చేశాయి అత్త, ఆడపడుచుల ముందు.

నిన్నటిదాకా పుట్టిపెరిగిన తన యిల్లూ తనవారూ గుర్తుకొచ్చి ఒక్కోక్షణంలో ఏడ్చేది శాంతి.


కానీ... కానీ... అదేం విచిత్రమో భర్త సాన్నిధ్యం... అపురూపమూ మరింత అపూరూప వరమూ అనిపించింది తనకి. ఏ బాధలనీ మరపింపజేసే అతని సాన్నిధ్యం. నిన్న మొన్నటిదాకా ఏ వూరివాడో కూడ తెలియని 'అతనిపై' నేడు తనకి దేనికా అనురాగం? ఎన్నడూ ఎక్కడా లభించని పరిపూర్ణత ఆ అపరిచితుని సన్నిధిలో లభించటం...భగవాన్ ఏమిటి నీ లీల.

నిజంగా స్త్రీ ఎంతటి స్వార్థపరురాలు! నిన్న మొన్నటిదాకా తనవారిని వదిలి తాను వుండలేనన్న దిగులు ఇపుడు ఎక్కడికిపోయింది? తన జీవితానికి శాంతి యిక పరిసమాప్తి అనుకొన్న తాను... నేడు భర్త సమక్షంలో అందరినీ మరచిపోయి వుండటం... స్త్రీకున్న స్వార్థం ఇంకెవరికీ లేదు స్త్రీ జీవితం స్వార్థ పూరితం.

ఇదే మాట రవిశంకర్‌తో అన్నపుడు అతను మృదువుగా నవ్వి ఏమన్నాడని?

"శాంతీ! పిచ్చిదానివి నువ్వు. స్త్రీ త్యాగమూర్తి అను ఒప్పుకుంటాను కానీ ఆమె స్వార్థపరురాలు అంటే మాత్రం.. వుహుం... భగవంతుని ప్రతిరూపమే స్త్రీ. సృష్టికి కారణం స్త్రీ. నువ్విపుడన్నావే స్వార్థమని, అందులోనే అనంతమయిన నిస్వార్థం దాగివుంది. అది కేవలం స్త్రీకే పరిమితం. ఒకరియింట పుట్టి, సర్వ సుఖాలు వదలుకొని అక్కడ తన కెటువంటి ఆదరణ వుండో, వుంటుందో తెలియని యింట అడుగుపెట్టే స్త్రీది స్వార్థ తత్వం కాదు శాంతీ సృష్టికార్యం. స్త్రీ-పురుషుడు లేనిదే సృష్టిలేదు. తనవారిని వదిలి పరాయిచోట అడుగుపెట్టే త్యాగ శీలత స్త్రీకి తప్ప మరెవరికి దక్కుతుంది. పురుషుడే స్వార్థపరుడు. కానీ స్త్రీ తన స్వార్థంలోనే నిస్వార్థం చూపే మహత్తర వెలుగు. దీపం తన వెలుగులో అందరికీ వెలుగుచూపాలనే తాపత్రయ పడుతుంది కానీ తన సుఖాన్ని చూచు కొంటుందా? అది స్వార్థమంటామా? పిచ్చిశాంతీ స్త్రీ పుట్టుకే గొప్ప వరం."

అతని మాటలలోని సత్యానికి శాంతి పులకించిపోయింది. ఇంత వున్నతంగా స్త్రీ గురించి ఆలోచించగలిగేవాడు తన భర్త. తనెంతటి అదృష్టవంతురాలు!




స్త్రీగా పుట్టటంకన్నా మరేం కావాలి అని పించిందప్పుడు.

రోజులు గడచిపోతున్నాయి. స్త్రీకి పరమశత్రువు, ప్రథమ శత్రువు స్త్రీయే కదా అని గ్రహింపగలిగింది శాంతి. పుట్టింట్లో చేయికదపాల్సిన అవసరం కూడలేని శాంతి యీనాడు యింటెడు చాకిరీ చేస్తున్నా లోకువకట్టి అత్త అజమాయిషీ చూపుతోంది, ఆడబిడ్డలు అడ్డమయిన మాటలూ అంటున్నారు. మొదట్లో వారి ప్రస్తావన సహింపరాని దనిపించినా చల్లని భర్త సన్నిధిలో అన్నీ మరచిపోగలిగేది శాంతి. కుందనపు బొమ్మలాంటి శాంతి, అతని కన్నుల వెలుగు. చదువు కొన్నా ఏమాత్రం గర్వం అతిశయం లేక, ఇలాంటి భార్య కావాలి అనిపించే శాంతి అతని కెంతో అపురూపం; అయితే కన్నవారి ఎత్తిపొడుపులు అతని చెవుల పడకపోలేదు. వీలున్నపుడల్లా తేటతెల్లంగా చెల్లెళ్లకు చెప్పేవాడు కానీ వాళ్లు 'నిన్ను కొంగుకుముడేసుకుని ఆడిస్తోందిరా నీ పెళ్ళాం' అని వెటకారం చేయటంతో శాంతిని మరిన్ని బాధలకు గురిచేస్తారని అతను ఎన్నిటికో రాజీపడ్డాడు.

"శాంతీ! కన్నీరు పెట్టుకోకు. తెలుసు శాంతీ! నాకు తెలుసు! నీ వెంత బాధపడుతున్నావో! నీ అంతట నువ్వు చెప్పవు కానీ నేను అర్థంచేసుకోగలను. నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లి నా రక్తం పంచుకుపుట్టిన నా చెల్లెళ్ళూ యింత హీనంగా ఎలా ప్రవర్తిస్తున్నారు? కావాలని ఏడిపించేవాళ్ళను ఏమి చెప్పి మార్చ మంటావు?

"స్త్రీగా పుట్టటం బాధే కానీ స్త్రీ స్త్రీగా బ్రతకటం అపురూపవరం. కానీ స్త్రీని స్త్రీయే ఎందుకు యిలా హింసిస్తుంది?

ఇది నా కెప్పటికీ అర్థంకాని ప్రశ్న. పురుషుడు స్త్రీని హింసింపాదంటారు కానీ నా దృష్టిలో అది ఏమాత్రం నిజంకాదు. ఆ పురుషుడు స్త్రీని హింసించడమన్నది మరో స్త్రీ ప్రోద్బలమే. అది మాత్రం నిజం. స్త్రీ జన్మకి నేనెంతో గౌరవ మిస్తాను. కానీ స్త్రీని స్త్రీయే గాయపరచటం ...ఓహ్... నేనేమాత్రం సహించలేను, భరించలేను నా హృదయంలో నీకు అత్యున్నతమయిన స్థానం వుంది శాంతీ! అది మరిచిపోకు."

ఆతని ఆదరణకి శాంతి నిలువెల్లా పులకించింది. ఆ తడిసిన కళ్ళల్లో మెరుపు గర్వం.

"చాలు నాకీ అదృష్టంచాలు. భగవాన్ ఈ అదృష్టమిలాగే వుండనీ" ఆతని హృదయంలో తలదాచుకుంది.

## 3

బారసాల చేసుకోవడానికి అత్త వారింటికొచ్చిన రవిశంకర్‌కు పండులాంటి కొడుకు ఆనందాన్ని కలగ చేశాడు. మాతృత్వపు అలల తెరలో మరింత దివ్యంగా వెలిగింది శాంతి ముఖం.

"బాబు నీలాగే వున్నాడు! మగపిల్ల వాడికి తల్లి పోలికవస్తే అదృష్టమట శాంతీ!"

భర్తమాటల్లో ఆప్యాయతకి కరిగి పోయి మురిసిపోయింది కొడుకుని చూచుకొని.

కొడుకు కృష్ణను వెంటబెట్టుకొని మూడవ నెలన తిరిగి అత్తవారింటికి చేరిన శాంతికి కొడుకు అచ్చట్లముచ్చట్లతో కాలగమనమే తెలియటం లేదు. కొడుకు కాసేపు దగ్గర వుండకపోతే గిలగిలలాడేది ప్రాణం. అత్తా ఆడబిడ్డల కరుకుదనం అలాగే వున్నా భర్త ఆదరణ, పుత్ర మమకారం గృహిణికి అపురూపంగా కలుగచేసే ఆనందాన్ని అందిస్తున్నాయి శాంతికి.

"స్త్రీ జన్మ సార్థకత అంటే ఏమిటో ఈనాడు అర్థమవుతూంది. మాతృత్వం వెలలేని కానుక స్త్రీకి" మురిపెంగా భర్తకి కొడుకుని అందిస్తూ అంది. చిరునవ్వుతో కృష్ణను ముద్దాడాడు రవిశంకర్.

## 4

ఇరవై సంవత్సరాలు యిట్టే దొర్లిపోయాయి. ఆడపడుచులు పెళ్ళిళ్ళయి అత్తవారిళ్ళలో వున్నారు. మరుదులకి పెళ్ళిళ్ళయి వాళ్ళ భార్యలతో కాపురాలు చేసుకొంటున్నారు. ముసలివారయిన అత్తగారూ, మామగారూ ఒక్కొక్క కొడుకు దగ్గర మూడేసి నెలలు వుంటూ వస్తున్నారు. కృష్ణ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఎన్ని మాటలు అన్నా అత్తా, ఆడపడచుల కలిసివున్న పూర్వం, ఆమెకు వెలితిగా అనిపించేది. ఇదీ లోకం అనుకుంది.

తనలాగే గ్రాడ్యుయేట్ అయిన కూతురు శ్రావణికి సంబంధాలు చూడటం

మొదలుపెట్టారు. శ్రావణిని చూస్తుంటే తన పూర్వ రూపమే గుర్తుకొచ్చేది శాంతికి. అచ్చు యిలాగే వుండేది తను. కాకపోతే శ్రావణీది తండ్రిలాగే మరో ఛాయ ఎక్కువ. అప్పట్లో తనెంతా బాధ పడింది పెళ్ళి వద్దని. తలచుకొంటే నవ్వు వస్తుంది. ఇపుడు శ్రావణికి తన లాంటి భావాలే వుంటాయా? ఏమో? తనకు దిగులుగా వుండె యిన్నేళ్ళు కడుపులో పెట్టుకుని పెంచుకున్న తన బంగారు తల్లిని పెళ్ళిచేసి పంపేయటమంటే. కానీ లోకరివాజు తన కోసం మారుతుందా? పైకి మందలించినా తన తల్లి ఎంత బాధ పడి వుంటుందో ఇపుడు తెలుస్తోంది. ఏదయినా తనదాకా వస్తేనే కదా తెలిసేది!

ఒక డాక్టరుతో శ్రావణి వివాహం నిశ్చయమయింది హడావుడిగా పెళ్ళి ఏర్పాట్లు, ఆ వెంటనే పెళ్ళి జరిగిపోయాయి

శ్రావణి అత్తవారింటికి వెడుతూ ఎంతలా కన్నీళ్ళు పెట్టుకుందనీ! శాంతికి అంతా తన గతమే గుర్తుకువచ్చింది. కనీసం తన బిడ్డకయినా తల్లిలా చూచు కొనే అత్తగారు వుండాలని కోరుకుంది. కూతురు వదిలివెళ్ళిన ఆ పరిసరాలు శాంతి గుండెల్నెంత కలచివేశాయో, భర్త హృదయంలో తలపెట్టి బావురు మన్న శాంతిని చెమర్చిన కన్నులతో రవిశంకర్ ఓదార్చాడు.

"నాకు మాత్రం బాధగాలేదా శాంతీ, పురుషుడికి స్త్రీకి తేడా అక్కడే. మీరు చప్పున ఏడ్చి హృదయభారం తీర్చు కొంటారు. మేములేని గాంభీర్యం నటిస్తూ లోలోపలే కుమిలిపోతాం. మరి బాధ పడకు. కొత్తగా కాపురానికి వచ్చిన శాంతిని గుర్తుచేసుకో! ఇది యుగయుగాల స్త్రీ ధర్మం. మీ స్త్రీ జాతికి వారసత్వంగా వచ్చే యుగధర్మం శాంతీ!"

## 5

"అమ్మా ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. ఇదంతా మీ ఆశీర్వాదబలమే!" కొడుకు అతి సంతోషంగా వచ్చి తన పాదాలమీద వాలుతుంటే ఎనలేని ఆనందంతో వుక్కిరి బిక్కిరి అయింది శాంతి. కొడుకుని లేవ నెత్తి మూగగా ఆశీర్వదించింది. వంట్లో నలతగా వున్నా అప్పటికప్పుడు కృష్ణ కిష్టమయిన పిండివంటలు చేసింది. తన కొడుకు ఇంజనీరు! ఆమె హృదయం పొంగి పురకలు వేస్తోంది.

కోడల్ని తెచ్చుకోవాలనే ఆరాటం మొదలయింది. ఇరవైఏళ్ళ శాంతి అత్త వారింటిగురించి వూహించుకున్న భయం మళ్ళీ మెదిలింది శాంతిలో. వుహూ! తను కోడల్ని ఆరడ్లు పెట్టదు. కోడలు దాసీది కాదు. ఆమె ఒక యింటి ఆడపిల్ల. తన శ్రావణీలాగే ఒకతల్లి దగ్గర్నుండి మరొక యింటికి వచ్చే అమాయకురాలు. తను పడిన పాట్లు ఆ పిల్ల పడకూడదు. తను మరొక తల్లి అవాలి ఆ కోడలికి. కోడ రికం బాధలు, తను ఎన్ని భరించిందని! తన భర్త సాన్నిధ్యం అతని వున్నత

హృదయం తనని సేదదీర్చాయి గానీ లేకపోతే వాళ్ళు పెట్టిన బాధలు ఎన్ని!

"అమ్మలాగా ఆరళ్లు పెట్టకమ్మా మీ కోడల్ని" కొంటెగా పరిహాసంగా రవి శంకర్ అంటుంటే నిజంగా మనసు నొచ్చుకుంది శాంతికి.

"స్త్రీ జన్మ స్త్రీలందరికీ ఒకటే అయినా మన స్తత్వాలు మాత్రం వేరు సుమండీ! నా కోడల్ని నా కూతురిలాగే చూచుకొంటాను. అయిన వాళ్ళందరినీ వదిలి అత్తింట అడుగుపెట్టిన ఆడపిల్లని కూతురికంటే ఎక్కువగా చూడాలి. స్త్రీని స్త్రీ హింసిస్తుందన్నారు ఒకప్పుడు. కానీ యిపుడు నే నంటున్నాను స్త్రీయే స్త్రీ హృదయాన్ని బాగా అర్థం చేసుకోగలదు"

## 6

"నాన్నా కృష్ణా! ప్రసాదరావుగారు వాళ్ళ అమ్మాయిని నీ కిస్తామని కబురు పెట్టారు. మీ నాన్న నీ మనసు కనుక్కోమంటున్నారు."

కృష్ణ సిగ్గుపడ్డాడు. తల్లి బ్రతిమాలగా చెప్పాడు. తాను యింజనీరు గారమ్మాయి వాహినిని ప్రేమించాననీ ఆమెకూ, వాళ్ళ వాళ్ళకీ కూడ యిష్టమేనని.

శాంతి ఆశ్చర్యపడలేదు. భర్తతో చెప్పి ఒప్పించింది.

"నాలుగు కాలాలపాటు కలసి వుండాల్సింది మీరు. నీ యిష్ట ప్రకారమే కానీ నాన్నా!"

కృష్ణ అటువంటి తల్లి తనకు దొరికినందుకు గర్వపడ్డాడు.


కృష్ణ కోరికమీద శాంతి, రవిశంకర్ పిల్లను చూసివచ్చారు. కట్నం తీసుకోమని అన్నారు. వాహిని చక్కనిదే కానీ మరీ నాగరికంగా వుంది ఆమె వేషధారణ. నాగరిక వేషధారణ కొంతవరకూ ఒప్పుకోవచ్చు గానీ అవి అతిక్రమించి స్త్రీజాతినే అవమానించే ధోరణిలో వుంటే, మగవారిని రెచ్చగొట్టేవిగా వుంటే, తరువాత జరిగే పరిణామాలకు స్త్రీ బాధ్యత ఎక్కువగా వున్నట్లు చెప్పవచ్చు.

"బొత్తిగా ఆ వేషం ఏమిటి నీ కోడలికి శాంతీ? చక్కగా అప్పటి నా శాంతిలా నిండు చీర జాకెట్టు నుదుట ఎర్రని కుంకుమబొట్టు, ఒక్క జడ ధరిస్తే ఎంత చూడముచ్చటగా వుంటుంది అయినా మనవాడికి ఆ వేషం ఎలా నచ్చిందటా?" విసుక్కొంటున్న భర్తను మందలింపుగా అన్నది శాంతి.

"భలేవారే! ఎవరి అభిరుచి వాళ్ళది. వాడికి నచ్చింది వాడు చేసుకొంటాడు. ఆ అమ్మాయి డ్రస్సెలా వున్నా, తన మంచిమనసు కావాలి మనకు. ఇంకోమారు ఇలా అనకండి" భార్య సహృదయతను మనసులోనే అభినందించుకున్నాడు రవి శంకర్.

## 7

వాహిని పెళ్ళయి అత్తవారింట అడుగు పెట్టింది. శాంతి కోడల్ని అపురూపంగా చూచుకొంటూంది. అదేమిటో మరి ఈ




లోకం తీరే అదో రకం. మెత్తగా వున్న వారి మంచితనాన్ని అలుసుగానూ, చేత కానితనంగానూ తీసుకొంటుంది. నోరు పెట్టుకుని గడుసుగా బ్రతికేవారికి అణిగి మణిగి దాసోహమంటుంది. అదే నిజ మయింది శాంతి కోడలివిషయంలో. వాహినికి అత్తగారి మంచితనం చేతకాని తనంగానే కనిపించింది. బొత్తిగా పని ముట్టుకోదు. అయినా శాంతి ఏమీ అనదు కాఫీకూడా ప్రక్కదగ్గరకే తెప్పించుకో సాగింది వాహిని. రవిశంకర్‌కు మాత్రం కోడలి వ్యవహారము సుతారమూ నచ్చ లేదు అన్నింటికంటే విచిత్రం తల్లీ దండ్రులంటే విపరీతమయిన గౌర వాభిమానాలు కల కృష్ణ ఈనాడు పూర్తిగా మారిపోయాడు. భార్య ప్రవర్తనను విమ ర్శించడు పైగా సమర్థిస్తాడు

"ఏమిటి శాంతీ! ఇంత మెత్తవిదాన వయిపోయావు? కోడల్ని కోత పెట్టమనను గానీ ఆ అమ్మాయికి నీమీద ఏమాత్రం గౌరవం లేకుండా చేసుకొన్నావు. నీ కొడుకు భార్యాదాసుడై తల్లి సపర్యలను సమర్థిస్తున్నాడు."

"ష్! పెద్దగా అనకండి. వింటే బాగుండదు. శ్రావణికి ఎలా చేశానో వాహినికీ అలాగే చేస్తున్నాను. వాహిని నా కూతురులాంటిదేనని ముందే చెప్పా నుగా! కాస్త చదువుకున్న పిల్ల కొబట్టి అలా..."

మృదువుగా ఆపిన భార్యను ఏమనాలో తెలియరేదు రవిశంకర్‌కు. "మరీ అంత వెనకేసుకు రాకు శాంతీ! చదువుకొన్న పిల్లయితే మాత్రం? అయినా నువ్వు చదువుకోలేదా, శ్రావణి చదువుకోలేదా? శ్రావణితో పోలుస్తున్నావు గానీ మన స్ఫూర్తిగా చెప్పు. శ్రావణి ఏనాడయినా

యిలా తన పక్కదగ్గరకు పీచేత కాఫీలు తెప్పించుకోందా? నీ వెనకాలే తిరుగుతూ అన్ని పనులలో నీకెంత సాయంగా వుండేది. నీ మెతకదనంతోనే వాళ్ళనిలా తయారుచేశావు"

చిరునవ్వుతో అక్కడినుండి వెళ్ళిపోయిన శాంతిని చూపి విసుగ్గా నిట్టూర్చారు రవిశంకర్, యిక శాంతిని మార్చటం అసాధ్యమని.

## 8

వాహిని సామాను సర్దుతోంది హడావుడిగా. కృష్ణకు హైదరాబాదు ట్రాన్స్ఫర్ అయింది. ఉద్యోగరీత్యా ఇవి తప్పనిసరి అయినా శాంతి చాలా కంగారు పడుతోంది కొడుకూ కోడలూ తమను వదలి వెడతారని. ఇన్నేళ్ళూ ప్రాణంలా మెసలిన ఒక్కగానొక్క కొడుకూ దూరంగా వెళ్ళిపోతుంటే... పట్టరాని దుఃఖం వస్తోంది. తోచిన పిండివంటలు చేసి క్యారియర్లో సర్దింది. సామానంతా తానే సర్దింది చాలామటుకు

"ఎందుకలా అస్తమానూ కన్నీళ్ళెట్టుకొంటారు? అంత కొడుకుని వుండలేమనుకొన్నవాళ్ళు పెద్ద చదువులెందుకు చెప్పించారు. శుభమా అని వుద్యోగమయి వెడుతుంటే శకునపక్షిలా ఏమిటా ఏడుపు?" వాహిని విసుక్కొంది అత్తగారిని. మామగారిమనసు మండిపోయింది ఆ మాటలకు. నోరు ఆవేశంగా లేచింది కాని శాంతి తనవంక దీనంగా చూసిన చూపులు— చాలా చికాకుగా అక్కడినుండి వెళ్ళిపోయాడు.

సాయంత్రం ట్రెయినుకి కొడుకూ, కోడలు వెళ్ళిపోయారు. వెలవెలబోతూ బావురుమంటూ వున్న ఆ యింటినిచూసి బెంగగా అనిపించింది శాంతికి.

అన్నం నోటి కెళ్ళలేదా రాత్రి.

"శాంతీ! నా అదృష్టంకొద్దీ మణిపూసవు దొరికావు. కానీ అన్నిమాటలు అని వెళ్ళిన ఆవిడమీద నీ కెందుకా మమకారం? చిన్నపిల్ల కదా అని వూరుకున్నాను గానీ, ఎన్ని మాటలంది చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా!

"పోనిద్దురూ! చిన్నతనం- వాడు దగ్గిరలేకుండా ఎప్పుడూ వుండలేదుగదా అందుకని.... యీ బాధ"


"నువ్వెన్నయినా చెప్పు. భార్యరాగానే ఆమెను నెత్తికెక్కించుకుని చిన్నప్పటినుండీ కంటికిరెప్పల్లా పెంచిన తల్లిదండ్రులను నిర్లక్ష్యంచేయటం ఛా! వాడు నా కొడుకని చెప్పుకోవటానికి కూడ సిగ్గువేస్తోంది"

## 9

ఐదేళ్ళు గిర్రున తిరిగాయి

"నాయనమ్మా" నాన్న వుద్యోగం ఈ వూరు అయిందిగా. నేను నీ దగ్గిర కొచ్చేశాను నాయనమ్మా ఇంకెప్పుడూ నీ దగ్గరే వుంటాను.

కృష్ణ కొడుకు పల్లవ్ పూరినుండి వచ్చీరాగానే శాంతి మెడచుట్టూ చేతులు




వేసి ముద్దులుకురిశాడు. శాంతి సంతోషానికి పట్టపగ్గాలు లేకుండా వుంది. ఎన్నేళ్ళు అయింది తన పిల్లవాడి దగ్గిర తనువుంది, అప్పుడప్పుడు చుట్టపుచూపుగా వచ్చిపోతున్నా దగ్గిరేనున్న ఆనందం యింకెక్కడ దొరుకుతుంది.

కృష్ణవాళ్ళు వస్తారని తెలియగానే యిల్లు సర్దటం, కొడుక్కీ కోడలికీ ఇష్టమయిన వంటకాలుచేయటం వీటితో సతమతమయిపోతున్న శాంతి, కొడుకు రాగానే మనవడిని చంకనేసుకుని వడిగా కోడలికి ఎదురయి చేయిపట్టుకొని లోనికి తీసుకురాబోయింది. వాహిని ప్రవర్తన్లో మార్పులేదు. అత్తగారి చేయి విడులాచ్చుకొని చరాచరా తానే లోపలికి వచ్చింది. తండ్రితో కబుర్లుచెపుతూ కృష్ణ వెనకాలే వస్తున్నాడు.

కొడుకు ఇంట్లోకి వచ్చాక ప్రేమాతిశయంతో కొడుకు తల ఆప్యాయంగా నిమిరింది. ఆమెను ఎనలేని ఆనందం వుక్కిరిబిక్కిరి చేస్తోంది.

భోజనాలు అయాక మనవడిని ఎత్తుకొని భర్త దగ్గిరకు తీసుకువచ్చింది.

“ఇప్పటికి అర్థమయిందండీ స్త్రీ అంటే. ఎవరెన్ని అన్నా ఏమనుకొన్నా తన సంతానం దగ్గిర ఎంతటి మహత్తరమయిన మనశ్శాంతి ఆనందం లభిస్తాయి. స్త్రీకి: నా బుజ్జితండ్రి, నా యీ మనవడు నా దగ్గరే వుంటాడంటే నాకెంత హాయిగా వుంది. మనస్ఫూర్తిగా అంటున్నాను స్త్రీగా జీవించటం అపురూప వరం. ఎదుటి స్త్రీ సహకారం వుంటే స్త్రీకి సమస్యే లేదు.”

విశాలనేత్రాలతో స్త్రీ అంటే నిర్వచనం చెపుతున్న భార్యవంక, ఆమె ఒడిలోని మనవడివంక తదేకంగా చూస్తూండిపోయాడు రవిశంకర్.